క్లుప్తంగా

గ్రంథాలయాల్లో పుస్తక పఠనం అలవరచుకోవాలి

కె.కోటపాడు: విద్యార్థులు గ్రంథాలయాల్లో పుస్తక పఠనం అలవరచుకోవాలని చౌడువాడ శాఖా గ్రంథాలయాధికారి ఎం.పద్మావతి అన్నారు. బుధవారం చదవడం మాకిష్టం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. చదువుతో పాటు చిత్రలేఖనంలో కూడా విద్యార్థులు ప్రతిభ చూపాలని ఆమె తెలిపారు.

వేడుకగా హిందీ భాషోత్సవం



ఉన్నత పాఠశాలలో ప్రదర్శనను తిలకిస్తున్న ఎంఈవో మూర్తి తదితరులు

మాకవరపాలెం: విద్యాశాఖ ఆదేశాలతో బుధవారం అన్ని పాఠశాలల్లో జాతీయ భాష హిందీ భాషోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు హిందీ భాషపై ప్రదర్శనలు చేశారు. మాకవరపాలెం ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎంఈవో మూర్తి పాల్గొన్నారు. హిందీ చదవడం, రాయడంలో పట్టు సాధించాలని విద్యార్థులకు సూచించారు. ఉత్తమ నైపుణ్యం ప్రదర్శించిన విద్యార్థులకు బహుమతులు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం అచ్యుతరామయ్య, ఆయా పాఠశాలల హిందీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రసన్నశ్రీకి అభినందనలు



ప్రసన్నశ్రీకి అభినందనలు తెలుపుతున్న ఖాసిం

కె.కోటపాడు: రాజమండ్రి నన్నయ యూనివర్సిటీ వైస్ చాన్సలర్‌గా నియమితులైన ప్రసన్నశ్రీని బుధవారం అయ్యన్న విద్యా సంస్థల డైరెక్టర్ డాక్టర్ ఎస్.కె.ఖాసిం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఏయూ ఇంగ్లీష్ విభాగంలో పని చేస్తోన్న ప్రొఫెసర్ ప్రసన్నశ్రీ వైస్ చాన్సలర్‌గా నియమితులవడం ఆనందదాయకమని డాక్టర్ ఖాసిం అన్నారు.

ఫార్మర్ రిజిస్ట్రేషన్‌తో ప్రభుత్వ పథకాలు




పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మాట్లాడుతున్న వాసుదేవరావు

మాడుగుల: ఫార్మర్ రిజిస్ట్రేషన్‌తోనే రైతులకు ప్రభుత్వ పథకాలు అందుతాయని వ్యవసాయాధికారి ఎం. వాసుదేవరావు అన్నారు. బుధవారం డి. గొటివాడ, ఎం. కోడూరు గ్రామాల్లో ఏర్పాటు చేసిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మాట్లాడారు. ఫార్మర్ రిజిస్ట్రేషన్ ఆధార్ కార్డులాగే రైతులకు ఒక గుర్తింపు సంఖ్య అన్నారు. ఒక్కసారి రిజిస్టర్ అయితే జీవిత కాలం అదే సంఖ్య వినియోగించుకోవచ్చన్నారు. అన్నదాతలు దగ్గరలోని రైతు సేవా కేంద్రానికి వెళ్లి విశిష్ట నంబర్ పొందాలన్నారు. దీని ద్వారా పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ తదితర ప్రభుత్వ పథకాలు అందుతాయని అవగాహన కల్పించారు.

2న ఘాట్ రోడ్ మోదమ్మ పాదాల తీర్థం

మాడుగుల: వచ్చే నెల 2వ తేదీన ఘాట్‌రోడ్ మోదమ్మ పాదాల తీర్థం జరగనుంది. ఆలయ కమిటీ, వర్తక సంఘం, ఆటో యూనియన్ ఆధ్వర్యంలో తీర్థ మహోత్సవం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా జిల్లాస్థాయి గుర్రం పందేలు, కబడ్డీ పోటీలు నిర్వహించనున్నారు. భారీ విద్యుత్ లైటింగ్, నేల వేషాలు, డాన్స్ హంగామా తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వర్తక, ఆటో యూనియన్ నాయకులు తెలిపారు.

అనిల్ నీరుకొండ ఆస్పత్రికి రోగుల తరలింపు



బయలుదేరడానికి సిద్ధంగా ఉన్న పలువురు రోగులు

మాడుగుల రూరల్: కె.జె.పురం భానోదయ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో దొర్ల సురవరం గ్రామానికి చెందిన 36 మంది పేషెంట్లను సంస్థ అధ్యక్షుడు రాపేట రామకొండలరావు ఆధ్వర్యంలో బుధవారం సంగివలస సమీపంలో గల అనిల్ నీరుకొండ ఆస్పత్రికి తరలించారు. రోగులకు ఉచితంగా తనిఖీలు, ఆపరేషన్లు చేస్తారని రామకొండలరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో సాగరం గ్రామ సర్పంచ్ కోట్ని జయమ్మ, సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

వానర మూక.. విధ్వంసం



లోపూడి వద్ద రహదారిపై కోతుల గుంపు



లూలూరులో కోతులు ధ్వంసం చేసిన పంట

బుచ్చెయ్యపేట: మండల రైతులకు కోతులు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. వందలాది కోతులు గుంపులు గుంపులుగా వచ్చి పంట పొలాల్లో పడి తినేస్తున్నాయి. వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టిన రైతులు కోతుల వల్ల తీవ్రంగా నష్టపోతున్నారు. ఇప్పటికే పంటలకు గిట్టుబాటు ధర లేక అప్పుల బాధతో అల్లాడుతున్న రైతాంగానికి కోతుల వల్ల మరిన్ని నష్టాలతో అతలాకుతలం అవుతున్నారు. గత దశాబ్ద కాలంగా వేలాది కోతులు ఎల్‌బీ పురం, బంగారుమెట్ట, లోపూడి, శింగవరం, పొట్టిదొరపాలెం, వడ్డాది, పి. భీమవరం, కొండెంపూడి, కొమ్మళ్లపూడి, గొల్లకొంపలు, బుదిరెడ్లపాలెం, గంటికొర్లాం, చిన అప్పనపాలెం, దిబ్బిడి, కేపీ అగ్రహారం తదితర గ్రామాల్లో గుంపులు గుంపులుగా తిరుగుతున్నాయి. రైతులు పండిస్తున్న వరి, చెరకు, కంది, మినుము, పెసర, గంటి, చోడి, అరటి, కొబ్బరి, పలు రకాల కాయగూరల పంటలను తినేయడమే కాక మిగిలిన పంటలన్నీ పాడు చేస్తున్నాయి. జీడి మామిడి, సపోట తోటలను నామరూపం లేకుండా చేస్తున్నాయి. కోతుల కారణంగా ఏటా లక్షల రూపాయల ఆదాయాన్ని రైతులు కోల్పోతున్నారు.

అధికారులు, నాయకులకు వినతులు..

కోతులను అరికట్టాలని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ దృష్టికి రైతులు తీసుకెళ్లారు. కలెక్టర్, డీఆర్వో, జిల్లా అటవీ శాఖాధికారితో పాటు రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షుడు నాగిరెడ్డి, మాజీ వ్యవసాయశాఖ మంత్రి కన్నబాబు, ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీని లోపూడి, బంగారుమెట్ట, ఎల్‌బీ పురం రైతు సంఘం నాయకులు కలిసి కోతుల బెడద నుండి రక్షించాలని వినతిపత్రాలు అందించారు. దీనిపై అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి స్పందించి రైతుల సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ నిర్ణయంతో సుమారు 20 గ్రామాల్లో తిరుగుతున్న కోతులను పట్టుకోవడానికి చర్యలు చేపట్టారు. తూర్పుగోదావరి జిల్లాలో ఉన్న కోతులను పట్టుకునే వారిని తీసికొచ్చి 2,200 కోతులను పట్టించి ఏజెన్సీ ప్రాంతాలకు తరలించి అడవుల్లో విడిచిపెట్టారు. దీంతో అప్పట్లో కోతుల బెడద తగ్గినా మరలా గత ఐదారు నెలలుగా వందలాది కోతులు గుంపులు గుంపులుగా వచ్చి పంటలను ధ్వంసం చేస్తున్నాయి.

ఇళ్లపైనా దాడులు..

మండలంలోని పంటలనే కాకుండా ఇళ్లల్లో కూడా దూరి కోతులు నానా బీభత్సం సృష్టిస్తున్నాయి. చిన్న పిల్లలు, మహిళలపై దాడి చేసి గాయపరుస్తున్నాయి. ఇళ్లల్లో ఉన్న ఆహార పదార్థాలను పట్టుకుపోతున్నాయి. వడ్డాది, పొట్టిదొరపాలెం, లోపూడి గ్రామాల్లో పలువురిపై కోతులు దాడి చేసి గాయపరచడంతో వారంతా ఆస్పత్రిలో చేరి వైద్య సేవలు పొందారు. తక్షణం నాయకులు, అధికారులు, ప్రభుత్వం స్పందించి కోతులను పూర్తి స్థాయిలో నిర్మూలించాలని పలు గ్రామాల రైతులు కోరుతున్నారు.



శింగవరం పొలాల్లో తిరుగుతున్న కోతులు

మురుగు సమస్యకు మోక్షం

సాక్షి ఎఫెక్ట్..



డ్రైనేజీల్లో చెత్తా చెదారాలు తొలగిస్తున్న పారిశుధ్య కార్మికులు

దేవరాపల్లి: మేజర్ పంచాయతీ దేవరాపల్లిలో 'డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తం' శీర్షికతో బుధవారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. డ్రైనేజీలు చెత్తా చెదారాలతో పూడుకుపోయి దుర్వాసన, దోమలతో ప్రజలు నరకయాతన పడుతున్నారని సాక్షి కథనంలో ప్రచురించింది. దీనికి స్థానిక ఎంపీడీవో ఎం.వి. సువర్ణరాజు స్పందించారు. యుద్ధప్రాతిపదికన డ్రైనేజీల్లో పూడికలు తొలగించాలని స్థానిక ఇన్‌చార్జి పంచాయతీ సెక్రటరీ కె. సుధాకర్‌బాబును ఆదేశించారు. దీంతో సుధాకర్‌బాబు బుధవారం అన్ని వీధుల్లో పర్యటించి దగ్గరుండి పారిశుధ్య కార్మికులతో డ్రైనేజీల్లో పూడికలను తొలగింపజేశారు. యాతపేట, మొండి వీధుల్లో నెలల తరబడి మురుగునీరు, చెత్తా చెదారాలతో పూడుకు పోయిన డ్రైనేజీలను శుభ్రం చేశారు. స్థానికులు సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.

సరుగుడు మొక్కల తొలగింపు



మొక్కలను దగ్గరుండి తొలగిస్తున్న తహసీల్దార్ రామారావు

మాకవరపాలెం: మెడికల్ కళాశాల భూమిలో వేసిన సరుగుడు మొక్కలను రెవెన్యూ అధికారులు తొలగించారు. మండలంలోని భీమబోయినపాలెం రెవెన్యూ పరిధిలో గత ప్రభుత్వం మెడికల్ కళాశాల నిర్మాణానికి 52 ఎకరాల భూమిని సేకరించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో రైతులకు అప్పట్లోనే పరిహారం అందజేసి, నిర్మాణం ప్రారంభించారు. ప్రస్తుతం ఖాళీగా ఉన్న భూమిలో పరిహారం పొందిన కొందరు రైతులు ఇటీవల సరుగుడు మొక్కలు నాటారు. ఈ విషయంపై అందిన ఫిర్యాదుతో బుధవారం ఇన్‌చార్జి తహసీల్దార్ రామారావు సరుగుడు మొక్కలు నాటిన భూమిని పరిశీలించారు. వెంటనే బ్లేడ్ ట్రాక్టర్‌తో మొక్కలను పూర్తిగా తొలగించారు. ప్రభుత్వ భూములను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సర్వే సిబ్బంది, భీమబోయినపాలెం, శెట్టిపాలెం సర్పంచ్‌లు కిషోర్, రామునాయుడు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న జ్ఞానజ్యోతి శిక్షణ తరగతులు



శిక్షణ అందిస్తున్న ఎంఈవోలు పాండురంగారావు, దేముడమ్మ

మాడుగుల: ఐసీడీఎస్ మాడుగుల ప్రాజెక్టు పరిధిలో అంగన్‌వాడీ వర్కర్లకు జ్ఞానజ్యోతి శిక్షణ తరగతులు బుధవారం కూడా జరిగాయి. ఈ సందర్భంగా ఎంఈవోలు ఎం. పాండురంగారావు, బి. దేముడమ్మ మాట్లాడారు. విద్యా విధానంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా అంగన్‌వాడీ వర్కర్లు పని చేసేందుకు వీలుగా శిక్షణ అందిస్తున్నామన్నారు. ప్రతి చిన్నారి మానసిక స్థితిని అర్థం చేసుకుని ఆటపాటల ద్వారా విద్యాబోధన జరిగే విధంగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. సీడీపీవో సీహెచ్ శ్రీదేవి, శిక్షకులు మణి కాంత, కృష్ణ, రవి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు నారాయణమ్మ, ఈశ్వరమ్మ, సీఆర్‌పీలు, వొమ్మలి అచ్యుతరావు, బొబ్బిలి హరి కృష్ణ, కాశీ సురేష్, నిద్దాన సంధ్య, ఎస్.శారద, ఎమ్మార్సీ సిబ్బంది రాజు, నాగేంద్ర, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.



అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ నిర్వహిస్తున్న దృశ్యం

తెలుసుకున్న అంశాలు బోధించాలి..

నాతవరం: జ్ఞానజ్యోతి శిక్షణ తరగతుల్లో తెలుసుకున్న విషయాలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు వివరించాలని ఎంఈవో-2 కామిరెడ్డి వరహాలబాబు అన్నారు. మండల కేంద్రంలో గల హైస్కూల్లో బుధవారం రెండో రోజు అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా విధానంలో వచ్చిన మార్పులకు అనుగుణంగా అంతా కలిసి పని చేయడమే శిక్షణ తరగతులు ముఖ్య ఉద్దేశమన్నారు. అనంతరం కోఆర్డినేటర్లు కూండ్రపు అర్జున కిశోర్ కార్యకర్తలకు పలు విషయాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు విజయలక్ష్మి, నాగజ్యోతి, సూర్యప్రభ, సీఆర్‌పీలు పోలుపర్తి నాగేశ్వరరావు, వెంకటలక్ష్మి, సత్యవేణి, గోవింద్, ఎంఆర్‌సీ అధికారులు అంకంరెడ్డి శ్రీనివాసనాయుడు, సాంబ నాయుడు, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఏరియా ఆస్పత్రిలో రక్తదాన శిబిరం



రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న సూపరింటెండెంట్ సుధా శారద

నర్సీపట్నం: ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని పురస్కరించుకుని వీఎస్ఎన్ బ్లడ్ సర్వీస్ ఆధ్వర్యంలో రక్తదానం చేశారు. ఏరియా ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని సూపరింటెండెంట్ సుధా శారద ప్రారంభించారు. రక్తదానం చేస్తే ఆపదలో ఉన్నవారిని కాపాడిన వారవుతారని పేర్కొన్నారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుడు శివాజీ మహారాజ్ జయంతి రోజున రక్తదానం చేయటం అభినందనీయమన్నారు. యువకులు, విద్యార్థులు రక్తదానం చేశారు. బ్లడ్ సర్వీస్ నిర్వాహకుడు వీరమాచినేని సందీప్, రిషీ కాలేజీ కరస్పాండెంట్ కోనా సతీష్, బీజేపీ జిల్లా సహ సభ్యత్వ ప్రముఖ్ పాకలపాటి అరవింద్‌రాజు, రిషి స్టడీ సర్కిల్ డైరెక్టర్ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా వేళల్లో మార్పు

నర్సీపట్నం: పరవాడ 220 కేవీ సబ్‌స్టేషన్‌లో కొత్త సర్క్యూట్ బ్రేకర్ అమరుస్తున్నందున 132 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో ఈ నెల 20, 21 తేదీల్లో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు విద్యుత్ సరఫరాలో మార్పులు చేస్తున్నామని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వి.డి.వి.రామకృష్ణారావు తెలిపారు. నర్సీపట్నం, గొలుగొండ, నాతవరం, మాకవరపాలెం, రోలుగుంట, కోటవురట్ల మండలాలు, కొత్తకోట సబ్‌స్టేషన్ పరిధిలోని వ్యవసాయ విద్యుత్ వినియోగదారులకు సరఫరా వేళల్లో మార్పులు చోటు చేసుకుంటాయన్నారు. ఈ నెల 2వ తేదీ తెల్లవారు జాము ఒంటి గంట నుండి ఉదయం 7 గంటల వరకు, సాయంత్రం 5 నుండి రాత్రి 8 గంటల వరకు, 21వ తేదీ ఉదయం 11 నుండి రాత్రి 8 గంటల వరకు త్రీఫేజ్ సరఫరా జరుగుతుందని, రైతులు సహకరించాలన్నారు.

మేలైన యాజమాన్యంతో అధిక దిగుబడి



మాట్లాడుతున్న ఆత్మ ఏడీఏ శ్రీధర్

చోడవరం రూరల్: మేలైన యాజమాన్య పద్ధతులతో ఉద్యాన పంటల్లో అధిక దిగుబడులు సాధించవచ్చని అనకాపల్లి జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం జిల్లా సహాయ వ్యవసాయాధికారి శ్రీధర్ అన్నారు. మండంలోని రాయపురాజుపేట రామాలయంలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. హాజరైన రైతులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ఆత్మ సౌజన్యంతో రైతులకు మేలైన సాంకేతిక యాజమాన్య పద్ధతులను పరిచయం చేయనున్నట్లు చెప్పారు. కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త మాట్లాడుతూ అపరాలలో మేలైన రకాలు, నూతన వంగడాల చిరుకిట్లను రానున్న సీజన్‌లో గ్రామంలోని రైతులకు అందజేయనున్నట్టు తెలిపారు. ఆసక్తి గల 20 మంది రైతులతో క్లస్టర్ ఏర్పాటు చేసి వారికి విత్తనం నుంచి పంట కోత దశ వరకు అన్ని సమయాల్లో పంటకు అవసరమయ్యే సమాచారం అందిస్తామని శాస్త్రవేత్త సౌజన్య తెలిపారు. జిల్లా వనరుల కేంద్రం ఏడీఏలు సుబ్రహ్మణ్యం, ఝాన్సీలక్ష్మి, ఏవో వి.తులసీమణి, చోడవరం సబ్ డివిజన్ ఏడీఏ రవీంద్రనాథ్, మండల వ్యవసాయాధికారి పావని, విస్తరణాధికారులు కిరణ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్లు దొంగిలించిన వ్యక్తి అరెస్టు

నర్సీపట్నం: గ్యాస్ సిలిండర్లు దొంగిలించిన వ్యక్తిని అరెస్టు చేశామని టౌన్ సీఐ జి.గోవిందరావు తెలిపారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు రెండు గ్యాస్ సిలిండర్లు పట్టుకుపోయారని నర్సీపట్నం టౌన్ వెలమవీధికి చెందిన ఎ.లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు. అదే వీధికి చెందిన పాత నేరస్తుడు కె.ఆనంద్ (26) సిలిండర్ల చోరీకి పాల్పడినట్టు దర్యాప్తులో రుజువైందన్నారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు.

ఘనంగా శివ మహా పడి పూజ



పూజలో పాల్గొన్న శివ మాలధారులు

కె.కోటపాడు: చౌడువాడలో శివ మాలధారులు బుధవారం రాత్రి భక్తిశ్రద్ధలతో శివ మహా పడి పూజా కార్యక్రమం జరిపారు. మండలంలో మొదటిసారి ఈ వేడుక జరగడంతో పలు గ్రామాలకు చెందిన శివ మాలధారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. దీవి అప్పలకొండ (దత్తు), భూలోక పర్యవేక్షణలో శాస్త్రోక్తంగా వేడుక నిర్వహించారు. అనంతరం శివునిపై మాలధారులు ఆలపించిన గీతాలు ఆకట్టుకున్నాయి. పూజా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మంచు శివలింగం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

చురుగ్గా సీసీ రోడ్డు పనులు



సీసీ రోడ్డు పనులు జరుగుతున్న దృశ్యం

మాడుగుల రూరల్: మండలంలోని కె.జె.పురంలో సీసీ రోడ్డు పనులు చురుగ్గా జరుగుతున్నాయి. స్థానిక కోనేరు గట్టు సమీపంలో పంచాయతీ ఆర్థిక సంఘం నిధులతో పనులు చేపట్టినట్లు సర్పంచ్ జామి రమణబాబు తెలిపారు. అలాగే కాళ్ల వారి ఇండ్ల సముదాయం వద్ద రోడ్డు పనులు బుధవారం ప్రారంభించారు. మండల పరిషత్ నిధులతో ఈ పనులు చేపట్టినట్లు స్థానిక ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాసరావు తెలిపారు.

వ్యర్థాలను ఎరువుగా మార్చి ఆదాయం పొందాలి



జోగుంపేట శిక్షణలో పాల్గొన్న అధికారులు

గొలుగొండ: పంచాయతీల్లో అధికారులు చెత్త సేకరించి ఎరువుగా తయారు చేసి ఆదాయం సంపాదించాలని జిల్లా రిసోర్స్‌పర్సన్ నాగలక్ష్మి, పంచాయతీ అధికారి శిరీషారాణి తెలిపారు. జోగుంపేట గ్రామంలో చెత్త నుండి సంపద తయారీ కేంద్రం వద్ద జిల్లాలో ఉన్న 13 మండలాల పంచాయతీ అధికారులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగలక్ష్మి మాట్లాడుతూ వర్మి కంపోస్టు ఎరువుల వల్ల ఆర్గానిక్ పంటలు సాగు చేసే దిశగా పంచాయతీ అధికారులు అడుగులు వేయాలన్నారు. ముందుగా 13 మండలాల్లో పని చేస్తున్న అధికారులకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఎంపీడీవో మేరీరోజ్, ఈవోఆర్‌డీ శ్రీనివాస్, పంచాయతీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

తక్షణం రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలి



సూచనలు చేస్తున్న తహసీల్దార్ వేణుగోపాల్

నాతవరం: మండలంలో పెండింగ్‌లో ఉన్న పీజీఆర్ఎస్ దరఖాస్తులు యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని తహసీల్దార్ ఎ.వేణుగోపాల్ అన్నారు. బుధవారం తన కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురైతే వీఆర్వోలే బాధ్యులవుతారన్నారు. జీవో నంబర్ 30 ప్రకారం నిర్మాణమైన ఇళ్లను క్రమబద్ధీకరించాలన్నారు. ఇంటి స్థలాన్ని బట్టి ఎంత కట్టించాలన్న నియమ నిబంధనలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ శివ, మండల సర్వేయర్ ప్రసాద్, వీఆర్‌వోలు, సచివాలయ సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

మాజీ కౌన్సిలర్‌కు పరామర్శ

నర్సీపట్నం: రోడ్డు ప్రమాదంలో గాయపడి కోలుకుంటున్న మాజీ మున్సిపల్ కౌన్సిలర్ వర్రె శ్రీనివాసరావును జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి, బీసీ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ రాజాన సూర్యచంద్ర బుధవారం పరామర్శించారు. సీఎం రిలీఫ్ ఫండ్ అందేలా కృషి చేస్తానని శ్రీనివాసరావుకు భరోసా కల్పించారు.

గొలుగొండ గురుకుల కళాశాల పరిశీలన



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ప్రభావతమ్మ

గొలుగొండ: గొలుగొండ గురుకుల కళాశాలను ఉమ్మడి జిల్లాల గురుకుల కళాశాలల కో ఆర్డినేటర్ ప్రభావతమ్మ బుధవారం పరిశీలించారు. ఆమెకు విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. కళాశాలలో విద్యార్థుల సంఖ్య, మౌలిక సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. టెస్ట్ విద్యార్థులకు మంచి భోజనం అందించి శతశాతం ఉత్తీర్ణత సాధించాలని తెలిపారు. విద్యార్థులకు సదుపాయాల కల్పన అంశం కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. కళాశాల అభివృద్ధికి తల్లిదండ్రుల కమిటీ సభ్యులు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కోటేశ్వరరావు, కమిటీ చైర్మన్ చిట్ల చలపతిరావు, ఏఐఎం మిషన్ పొలిట్ బ్యూరో సభ్యులు వీరబాబు, మేకపాక శివ తదితరులు పాల్గొన్నారు.

శివరామపురంలో ఫ్యామిలీ ఫిజీషియన్

మాడుగుల రూరల్: మండలంలో పొంగలిపాక శివారు పి. శివరామపురంలో బుధవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. కింతలి పీహెచ్‌సీ పరిధిలో జరిగిన ఈ కార్యక్రమంలో 60 మందిని పీహెచ్‌సీ వైద్యాధికారి నాగదివ్య పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

ఆలయ పునరుద్ధరణ పనుల ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న గ్రామ నాయకులు



ఉమా నీలకంఠేశ్వరస్వామి

బుచ్చెయ్యపేట: మండలంలోని మేజర్ పంచాయతీ వడ్డాది ఉమా నీలకంఠేశ్వరస్వామి ఆలయ పునరుద్ధరణ పనులు బుధవారం వేదపండితుల సమక్షంలో శాస్త్రోక్తంగా పూజలు చేసి ప్రారంభించారు. సుమారు 330 ఏళ్లనాటి ఈ ఆలయం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. ఆలయ గోపురం అంతా పొక్కుపోయి ఏ మాత్రం వర్షం కురిసిన నీరు లీకై ఆలయం కూలిపోయే స్థితికి చేరింది. దీంతో వడ్డాది గ్రామ నాయకులు, యువకులు, ఆలయ సిబ్బంది ఆలయం అభివృద్ధికి చర్యలు చేపట్టారు. ఉదయం గణపతి పూజ చేసి ఆలయ పునరుద్ధరణ, ధ్వజ స్తంభం పనులు చేపట్టారు. పలు పార్టీలకు చెందిన గ్రామ పెద్దలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి రఘువర్మకు మద్దతుగా ప్రచారం



కె.కోటపాడులో ప్రచారం చేస్తున్న శ్రీనివాసరావు తదితరులు

కె.కోటపాడు: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఏపీటీఎఫ్ అభ్యర్థి పాకలపాటి రఘువర్మకు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని మండల ఏపీటీఎఫ్ అధ్యక్షుడు సూర్రెడ్డి శ్రీనివాసరావు కోరారు. కె.కోటపాడు, ఎ.కోడూరు, కొరువాడ, పాతవలస, ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఉపాధ్యాయులను కలిసి రఘువర్మకు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో ఆయనతో పాటు బి.శ్రీరామ్మూర్తి, కిలపర్తి శ్రీనివాసరావు, ఎం.శ్రీనివాసరావు తదితరు లు పాల్గొన్నారు.